5827
శ్రీకాకుళం

# విల్‌ఫోన్లు

యూత్‌క్లబ్ కలకలలాడుతువుంది. ఆవరణలోపల టెంట్లువేసి ఓ వేదికను ఏర్పాటు చేసారు. ఎం.పి. నిధులతో కట్టించిన క్లబ్ భవనాన్ని ఆయనే ప్రారంభిస్తారు. సినిమా పాటలు వేయడం వల్ల పిల్లలు పెద్దలు అక్కడ కూడారు. ఓ కారొచ్చి ఆగింది. యువకులు ఎదురెళ్ళి మేళ తాళలతో తోడుకొని వచ్చారు. కొందరు పార్టీకి జై అంటే మరికొందరు పేరుకు జై కొట్టారు. ఇద్దరు యువతులు హారతి పళ్ళాలతో వచ్చి ఆ ప్రజాపతినిధికి గంధం తిలకం దిద్దారు. పళ్ళెంలో ఉన్న కత్తెరను తీసుకొని గేటుకు అడ్డంగా కట్టి ఉంచిన కాశాయ రంగు రిబ్బన్ కత్తిరించగా లోపలికి నడిచారు.

యం.పి. గారు చేతులు జోడించి, చిరునవ్వుతో వేదికపై ఏర్పాటు చేసిన కుర్చీలో కూర్చోగానే ఆయనతో వచ్చిన యువకులు పక్కకు జరిగి నిల్చున్నారు. వాళ్ల పక్కన గన్‌మెన్ నిలుచున్నాడు. క్లబ్ కార్యదర్శి మైకు దగ్గరకొచ్చి

" ఈ సభకు అధ్యక్షత వహించాల్సిందిగా క్లబ్ అధ్యక్షుల గారిని కోరుతున్నాను." అనగానే కరతాళ ధ్వనులు మోగాయి. రాంరెడ్డి వేదికపై రాగానే ఆయననే చూస్తూ ఓ నడీడు వ్యక్తి

"యువజన క్లబ్‌కు నలుబదేండ్ల వ్యక్తి అధ్యక్షుడేందో" అన్నాడు. అప్పుడు ఆయన మందు మీదున్నట్టుంది.

" అది అంతె " అన్నాడు మరొకరు. ఆయన కూడ ఊగుతూనే ఉన్నాడు. రాంరెడ్డి చేతులు జోడించి చుట్టూర అభివాదం చేసి, నాయకునికి నమస్కరిస్తూ అధ్యక్షుని స్థానంలో కూర్చున్నాడు.

కార్యదర్శి మిగతా కార్యక్రమంలో భాగంగా తన నివేదికను చదవసాగాడు.

" ఈ క్లబ్ పదేండ్ల క్రింద మొదలై దిన దినా అభివృద్ధి చెందుతూ వస్తుంది.

ఎందరో యువకులకు రకరకాల రంగాలలో స్థిరపడేటట్లు చేసింది. అందుకు జిల్లా అధికారుల సహాయం, అనధికారుల ప్రోత్సాహంతోపాటు ప్రజా ప్రతినిధుల సహకారం ఎంతో ఉందన్న విషయం అందరికి తెలుసు. ఈ సందర్భంగా వారికి మా ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం" జనం మౌనంగా వింటున్నారు. ముందు కూర్చున్న బాలలు ముచ్చట్లలో మునిగి ఉన్నారు.
"చప్పట్లు కొట్టండి" అన్నాడు అధ్యక్షులు జనం వైపు చూస్తూ
రాళ్ళవానలాగ చప్పట్లు శబ్దం.
షామియానంతా సంతోషపు అలలు. బాలల చూపుల్లో రేపటి కలలు.
" ఇప్పుడు మన యం.పి. గారు మాట్లాడతారు " అనగానే లేచి మైకు దగ్గరకు వచ్చాడు.
"సభాధ్యక్షులు, క్లబ్ సభ్యులు, సోదరీ సోదరులారా, విద్యార్థుల్లారా, పాత్రికేయుల్లారా మీ అందరికి వందనాలు.
ఈ రోజు ఎంతో శుభదినం. ఈ వాడ యువకులు ఈ స్థలం,ఇందులో ఓ భవనం కలిగి ఉండడం మాములు విషయం కాదు.
మా చిన్నపుడు నలుగురు యువకులం కలిసి మాట్లాడుకోవాలంటే ఏ వేపచెట్లో, చింతచెట్లో దిక్కు. గాలోచ్చినా, వానొచ్చినా ఇళ్లకు పరుగు. ఇప్పుడు మీకా పరిస్థితి లేదు. చూడటానికి టి.వి. ఆడుకోవటానికి ఆట వస్తువులు ఉన్నాయి. కాలంతో వస్తున్న మార్పులు ఇవి. ప్రభుత్వం మీ కోసం ఎన్నో స్కీములను సిద్ధం చేస్తుంది. ఆటోలకు, ట్రాక్టర్లకు ఇతరత్ర పని చేసుకునే పరికరాలకు అప్పులిస్తుంది. అదికాకుండా ఇద్దరు ముగ్గురికి టెలికాం అడ్వైజరీ కమిటి మెంబర్‌షిప్ వచ్చింది. వాళ్ళ ఇండ్లకు ఫోన్లవసతి, ఫ్రీకాల్స్ వినియోగ సౌకర్యం ఉంది. ఈవాడలో గుడికట్టించడం, స్మశాన వాటిక దగ్గర బోరు వేయడం, మైనార్టీ సోదరులకు షాదిఖాన నిర్మాణం జరిగాయి.
చూడండి ఒక్క మాటలో చెప్పాలి అంటే మాకు మీరు, మీకు మేము. పనిపడితే అర్ధరాత్రి అయినా నా తలుపు తట్టండి మీకోసం తెరుచుకుంటాయి. లేదా ఒకఫోన్ కాల్ చాలు నేనొచ్చి వాలుతాను" అనగానే కరతాళ ధ్వనులు.
" పనిలో పనిగా మా క్లబ్‌కొ ఫోన్ ఇప్పించండి" అన్నాడు క్లబ్ కార్యదర్శి. ఉత్సాహంగా చుట్టూ చూస్తూ
" మీరు కోరినంక నేను కాదంటానా? క్లబ్‌కే కాదు వాడ వాడకోటి ఇప్పిస్తాను. మీరు వాడ కమిటీలు వేసుకొని రండి. కమిటికో సెల్‌ఫోన్" అనగానే. ఈసారి చాలా సేపటివరకు చప్పట్లే చప్పట్లు.

" ఫోను పీసులు రిలయన్స్‌లో బాగున్నాయి సార్" క్లబ్ కార్యదర్శి పక్క నుండి అన్నాడు.
" సరే వాటినే తీసుకుందాం" అనగానే కార్యకర్తల కరతాళ ధ్వనులు.
" త్వరలో ఎన్నికలు రానున్నాయి. కార్యకర్తలకు పార్టీ నాయకులకు మధ్య లగాతార్ సంబంధాలు ఎంతైన అవసరం.
మీతో  కొంతసేపు మాట్లాడుకునే ఈ అవకాశం కల్పించినందుకు మీ అందరికి కృతజ్ఞతలు తెలియజేస్తు శెలవు" అంటు కూర్చున్నారు.
అధ్యక్షున్ని మలిపలుకులు అన్నీ ఎంపి గారికి కృతజ్ఞతలే. సెల్‌ఫోన్‌ల ఏర్పాటుకు మరీ మరీ కృతజ్ఞతలు చెపుతూ,
" దేశం  ఎదిగిపోతుంది " అనినినాదాన్ని యిచ్చాడు.
సభ ముగిసింది. నడుస్తున్న ఎంపి జేబులో సెల్‌మోగితే యువకులంత అటువైపు చూసారు. " రేపటి నుండి మా జేబుల్లోను మోగుతాయిలే" అని ఎవరికి వారె అనుకుంటు నడుస్తున్నారు.
మరునాడు పొద్దుటే యంపి గారి ఇంటిముందు గన్‌మెన్లు 'టీ' చప్పరిస్తు దిన పత్రికను తిరగేస్తున్నారు.
ఈ లోపు ఓమోటర్ సైకిలొచ్చి ఆగింది. క్లబ్ కార్యదర్శి రాంరెడ్డి దిగి లోపలికి కొచ్చాడు.
" ఏం రెడ్డి ఎంటి సంగతులు" అడిగాడు
" ఏంలేదు సారు గ్రంథాలయ అధ్యక్ష పదవి ఓటి ఖాళీగా వుందిగద గదినాకిప్పిస్తే - " అంటు ఎదురు కుర్చీలో కూర్చున్నాడు.
" ఏం చదువుకున్నావయా" నవ్వు ముఖంతో అడిగాడు సూటిగా చూస్తూ
" చదివినవాళ్లకేనా పదవులు?" అన్నాడు ఓ మాదిరి న్యూనత భావంతో.
" మిగతా పదవుల సంగతి వొదిలేయి. గ్రంథాలయ అధ్యక్షుడు మాత్రం బాగ చదువుకున్నవాడై ఉండాలి." అప్పుడే వస్తున్న పార్టీ అధ్యక్షున్ని చూపిస్తూ
"ఈ పని పార్టీ అధ్యక్షునిది. ఆయనకు చెప్పండి" నవ్వు ముఖంతో అన్నాడు
" నాకూ చెప్పాడు. నా చేతుల్లో ఏముందిసార్ ఏదో పార్టీ, మీటింగులకు అధ్యక్షత వహించడం. పార్టీ ఆజ్ఞలే పాటించడం తప్పా ప్రతిపాదన లెక్కడివి అన్నాడు" అతి కష్టంగా గుటక వేస్తు బహుశ ఊముమింగినట్లయింది.
" ఈయనకు సరిపోయేది, ఒక్క మార్కెట్ కమిటి ఛైర్మనే. అదైతే దానికి న్యాయం చేకూర్చుతడు. ధాన్యం రకాలు తెలుసు, ధరల గిట్టుబాటు తెలుసు" అన్నాడు, మళ్లీతానే అతని ముఖంలోకి చూడకుండ ఎంపి గారి వైపు చూస్తూ.

" పని మీద వెలుతున్న వార్డు కమిటీల వాళ్లు వస్తారు. ఫారాలు నింపి, ఒక జమానత్ దారుని సంతకం చేయించి, తీసుకురమ్మని చెప్పండి అధ్యక్ష" అంటూ తాను కదలగా ఆయన వెంట తూపాకులు నడిచాయి.

*

ట్రిన్ ట్రిన్ సెల్ మోగింది. సెక్యూరిటి అందుకని చెవు దగ్గరుంచి "హాలో, ఎవరు" అన్నాడు.

" ఎంపి గారు లేరా"

" ఇస్తున్న"

" హాలో "

" సార్ యూత్‌క్లబ్ కార్యదర్శిని"

" చెప్పండి"

" మీ దగ్గరికొద్దామని, ఉన్నారోలేరో అని ఫోన్ చేస్తున్న"

" ఇంట్లోనేవున్నరండి" ' సెల్ ఎన్‌క్వరీ కోసమేనా' అనుకున్నాడు.

కాసేపటికి మళ్లీ సెల్ మోగింది.

" హాలో "

" ఎంపి గారా, నేను వార్డ్ మెంబర్‌ను సార్"

సెల్ పీసుకు, పెదాల మధ్యన అరచేతిని అడ్డముంచి వార్డు మెంబర్, ' పేరు చెప్పకపోతే ఎవరైంది ఎట్లా తెలుస్తుంది' అని చేయి తొలగించి, " చెప్పండి ఏవార్డు " అంటూ అడిగాడు.

" తొమ్మిదో వార్డు సారూ రంగయ్యను" అనగానే

" ఓ రంగయ్యగారా ఏంటి అంతా కులాసా" అన్నప్పుడు రంగయ్య ముఖం పొద్దు తిరుగుడు పువులా విప్పుకుంది. పక్కవానివైపు మల్లి " ఎంపీ గారు లైన్‌లో ఉన్నారు." అంటు సెల్‌పీస్‌వైపు వేలితో చూపించాడు.

' అట్లనా అన్నట్టు చూస్తు' " ఏది నేను మాట్లాడుతా" అనగానే

" సార్ మన మున్సిపల్ వర్కర్ మాట్లాడుతడట" అని సెల్ అతనికిచ్చాడు.

" సార్, ఎంపి గారేనా మాట్లాడేది. నేను వీరయ్యను మాట్లాడుతున్న మాకింకా జీతాలు రాలేదు. జర మా ఛైర్మన్ గారికి చెప్పండి" అన్నాడు నవ్వు ముఖంతో..

ఎంపి గారెమన్నారో గాని వినపడలేదు. అటువైపు సెల్ ఆఫ్ అయింది. వార్డు మెంబర్లందరి దగ్గర రిలయన్స్ సెల్‌లు మెరుస్తూన్నాయి. మోగుతునే ఉన్నాయి. 'సెల్‌లు ఇప్పించి ఇర్కాటంలో పడ్డాను. ఎత్తకుంటే ఎత్తలేదని,

స్విచ్ ఆప్‌చేస్తే బందు పెట్టిండ్రని, ఎత్తితేనెమో, రాని పోని మాటలు. కలుసుకున్నపుడు మాట్లాడుకునే కార్యకర్తలు ఇప్పుడు సెల్ టూ సెల్ గోల గోలా' అనుకున్నాడు తనలోతాను

సెల్‌లు వచ్చినంక అందరి ముఖాలలో ఆనందపు తెర. స్టేటస్ పొర పార్టీ మీటింగ్ జరుగుతువుంటే సెల్‌మోగా గానే బయటికి పరుగెత్తుడు రోడ్డుకు ప్రక్కకు ఆగి మాట్లాడుడు రకా రకాల భంగిమల ప్రదర్శనలు.

" అవును అందరం ఈ తీరుగ సెల్‌లల్లో మాట్లాడుతున్నాం మరీ బిల్‌ల సంగతి" అని అడిగాడు ఓ మెంబర్.

" నీకెందుకుర పరేషాని. ఇంత వరకు ఎవరికి బిల్‌రాలేదు. వచ్చిందా?" అని అడిగాడు రెండవ వార్డు మెంబర్

" రాలేదు. ఒకేసారి వస్తే" అన్నాడు మూడవ వార్డు మెంబర్.

" వస్తే ఆయనే చూసుకుంటారు. ఆయనతో మాట్లాడడానికే కదా ఇవి" అన్నాడు దీమాగా రెండవ వార్డు మెంబర్.

" సెల్ పీస్ పైసలు కాక బిల్‌గూడనా" పదవ వార్డు మెంబర్.

" ఆయన కట్టకుంటే పార్టీ కడతది. ప్రభుత్వమే మన పార్టీదాయె మజాకా!!

" అంతేనంటావా" అన్నాడు. ఏదో రహస్యం మెల్లమెల్లగా అర్థమైనట్టు మూడవ వార్డు మెంబర్.

" ఎవరికి లేని భయం నీకెందుకు" అంటు సెల్‌మోగగానే చెవిదగ్గర పెట్టుకుని "హల్లో" అన్నాడు. అవతలి వ్యక్తి మాట్లాడుతున్నంత సేపు ఆయన ముఖ కవలికలను గమనిస్తూ" " ఎవరు" అని అడిగాడు మూడవ వార్డు మెంబర్.

" మా బామ్మర్ది పోలీస్ స్టేషన్‌లో పడ్డాడట నన్ను రమ్మంటున్నాడు. నీవు కూడా పద" అంటు కదిలాడు.

ఆ పూట వార్డు మెంబర్స్ కొందరు మున్సిపల్ ఆఫీసుముందు నిలుచొని మాట్లాడుకుంటున్నరు. అందరి జేబుల్లో సెల్‌లు హెచరీస్ దగ్గర కోడిపిల్లలు మొత్తుకున్నట్టే.

" ట్రీం ట్రీం " అని శబ్దం కాగానే అందరు ఒక్కసారి జేబులు చూసుకున్నారు. అది మోగింది. నాలుగవ వార్డు మెంబర్ జేబులో. దానిని చెవిదగ్గర వుంచి "హల్లో" అన్నాడు.

"హల్లో" అంది అవతలి గొంతు. ఆ గొంతు ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

" ఊ చెప్పు " అన్నాడు.

" చెపుతా. తొందరా. ఎప్పుడొస్తున్నారు మా ఇంటికి. పొద్దుగాల వస్తే

సినిమాకు కూడా పోదాం" మత్తు నిండిన గొంతుతో అంది రంగనాయకి. రాజకీయాలలో అలసిన వాళ్లు ఆమె ఇంటికి వెళ్లి రిలాక్స్ అవుతుంటారు. తిండి, తాగుడు ఏదంటే అది. మనిషి మంచి పొడగరి అన్నీటికంటె గడుసరి.
' సినిమాకే అయితే ఇంటికెందుకు. తానే టాకీసు దగ్గర్కి రావొచ్చుగ' అనుకుంటున్నప్పుడు
" వస్తారుగా. చ్చా" అన్న శబ్దం.
' ఓప్ ఫోన్‌లోనే" అనుకుంటు ఆఫ్ చేసి జేబులో వేసుకుంటు మహిళా కార్యకర్త అని సెల్ ఇప్పిస్తే ఇది ఈమె నిర్వాకం
" ఎక్కడనుండి" అని అడిగాడు ఐదవ వార్డు మెంబర్. చెప్పలేక నవ్వాడు. జర్దా పాన్ వాసన వచ్చింది.
సెల్‌ఫోన్‌లొచ్చి రహస్యాలకు రక్షణ కవచాలైనాయి.
" ఆ పెళ్లి గాని కంకికొడవలి పోరడు లేడు వాడు కమలం గుర్తు కమలకు ఫోన్‌చేసి గంటలకొద్ది మాట్లాడుతాడట."
బిల్ వచ్చినంక తెలుస్తుంది ప్రేమ ఎంత ఖరీదైందో! ప్రేమికులకైతే సాక్ష్యం లేని సారథులు ఈ సెల్‌లు. పట్టుపడే ప్రశ్నేలేదు. కలుసుకోవడానికి రమ్మనడం, ఎక్కడికి, ఎప్పుడు రావాలో చెప్పుకోవడం, ఆలస్యం అయితే గుర్తుచేసుకోవడం, ఎంతో సులువైపోయింది.
" అవునూ టివి చూస్తున్నావా?" అన్నాడు మూడవ వార్డు మెంబర్
" చూస్తున్న" ఎందుకు అన్నట్టు కను బొమ్మలు కదిలిస్తూ" అన్నాడు ఐదవ వార్డు మెంబర్.
" సెల్‌ఫోన్ల గురించి ఓ సీరియల్ వచ్చింది" అంటు అతనివైపు చూడకుండ నేలవైపు చూసాడు
" రానీ వస్తే ఏం. అంత సీను ఇక్కడలేదులే. మనది రూలింగ్ పార్టీ?" అంటూ ఎవరికో సెల్ కలిపాడు" అయినా ఆ సీరియల్‌లో రిలయన్స్ వాళ్ళు సెల్ బిల్స్ కోసం చేసే దౌర్జన్యం, రౌడిగుంపు ఇళ్లలో జొరపడి ఉన్నవన్ని ఎత్తుకుపోవడం. ఇజ్జత్ కచరా చేయడం.! కళ్ల ముందు కదిలింది.!!

*

అదీ ఇదీ అనేలోపే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ కూడారానే వచ్చింది. రెండు నెలల్లో ఎన్నికలు. ఎన్నికల హడావుడి మొదలైంది.
పార్టీలు తమ ప్రచారం మొదలు పెట్టాయి. పార్టీ టికెట్స్ కోసం పైరవీలు. రిటైర్డ్ ఉద్యోగులు పార్టీల తీర్థం పుచ్చుకొని ఆయా పార్టీల కండవాలతో

టికెట్ల కోసం తిరుగుతూ ఉంటే మొదటి నుండి పార్టీ జెండాలు మోస్తూ తన్నులకు గుద్దులకు తలలొగ్గిన కార్యకర్తలు కళ్లెర్ర చేసి చూస్తున్నరు. సినిమా టికెట్లలాగా, సర్కస్ టికెట్ల లాగా పార్టీ టికెట్లు పుచ్చుకోవడం, ఇచ్చుకోవడం జరిగిపోతూనే ఉన్నాయి. ఎట్టయితేనేం పార్టీ గుర్తులు మారాయి తప్ప అభ్యర్థులు వాళ్లే. మొత్తం మీద అభ్యర్థుల ఎంపిక చేసి బి. ఫారాలు ఇచ్చారు. టికెట్ రాని వాళ్లు కొందరు రెబల్స్‌గా రంగంలోకి దిగారు.

అభ్యర్థుల ప్రచారాలు ముమ్మరం అయినాయి. నల్లడబ్బు రూపం మార్చుకొని ఆట వస్తువులుగా, టివిలుగా, పాత్రలుగ వార్డులకు చేరుతున్నయి. కొందరి దగ్గరికి ఉన్నదున్నట్టు నోట్లుగానే చేరుతున్నాయి. మరి కొందరి ఇళ్లకు మధ్యపు సీసాలు చేరుతు ఉన్నాయి. ఎన్నడు లేనంతగ అభ్యర్థులు డబ్బును గుప్పిస్తున్నారు.

అవినీతిని ఆపడం కష్టం! మధ్యాన్ని మాన్పించడం మరీ కష్టం! వ్యభిచారాన్ని అరికట్టడం అంతకంటే కష్టం! సందు దొరికితే చాలు ఈ మూడు కట్టలు తెంచుకొని చట్టం కంట్లో కారం కొడుతాయి.

ఎన్నికల కమీషన్ కట్టుబాట్ల మూలంగా అభ్యర్థులు తమ ప్రచార సరళిని మార్చుకున్నారు. ప్రచార సామాగ్రి అనుకున్నట్లు వాడుకలోకి రాకుండా ఆంక్షలు. అందువల్లా తయారీదారులు నష్టాల్లోకి జారిపోకతప్పలేదు. మీడియా చానల్స్ ప్రచారం మాత్రం జోరుగా సాగింది. పార్టీల మానిఫెస్టోలు, కార్టూన్ కామెడీలు, ఒకటేమిటి పార్టీ గుర్తుల ప్రకటనలు. ప్రభుత్వం ఈ.వీ.యం ద్వారా ఓటు ఎలావేయాలో మీడియాలో వివరించాయి. మొత్తం మీద అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు తప్ప పోలింగ్ ప్రశాంతంగానే జరిగింది.

సెల్ మోగింది. ' హలో సార్ నేను శకుంతలను డ్వాక్రా మహిళా గ్రూపు మున్సిపాలిటిలో కాల్వల పనులకు, పైపు పనులకు టెండర్ పిలువాలనుకుంటున్నారు. ఏ పనులైనా ముందు డ్వాక్రా మహిళా గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వ జి.ఓ. ఉంది కదా కమీషనర్‌కు మీరు ఒకసారి ఫోన్ చేసి చెప్పండి సార్ అంది."

" మా పరిస్థితి తెలుసు కదా అయిన చెబుతాలే. ఆ తరువాత ఒకసారి వెళ్లి కలవండి అన్నాడు" మాజీ.

" సరే సార్ గెలుపు ఓటమిల సంగతి చెప్పరు" అని అడిగింది
" ఆవిషయం మీరే చెప్పాలి" అన్నాడు.
" ఇంకెవరు గెలుస్తారు సార్ మహిళలకు పువ్వు అంటే ఇష్టం కదా, పోగా మహిళలకు మన పార్టీ చేసిన మేలు ఇంతంతా కాదు గదా? అందుకని మహిళలందరు మన పార్టీ వెనకే. గెలుపు మనదే" అంది.
" నీట ముంచినా మీరే పాలల్లో ముంచినా మీరే మరోసారి కలుసుకున్నపుడు మాట్లాడుకుందాం ఉంటా" అంటు సెల్ ఆఫ్ చేశాడు. శకుంతల నవ్వు ముఖంతో మిగతా సభ్యులవైపు చూసింది.
'కాంట్రాక్టు పని తప్పక మనకే దొరుకుతుందిలే అనుకుంటూ, విప్పుకున్న పువ్వుల్లా కనిపించారు ఒకరికి మరొకరు.
" ఈ రోజు సెలీనా బాగా తయారై వచ్చిందే" అంది శకుంతల కనుబొమ్మలు పైకి కదిలిస్తూ
" కమీషనర్ దగ్గరికి పోవాలన్నావుగా" మరో మెంబర్ సుశీల నవ్వకనే నవ్వుతూ
" నీవేమో తక్కువ తయారై వస్తివా" అంది సెలీనా, సుశీల వైపు చూస్తూ
" ఎవ్వరు ఎట్లొచ్చిన కమీషనర్‌ను పల్టీ కొట్టించి పనిని చేపట్టాలన్నదే మన ప్లాన్" అన్నది శకుంతల ఓ కన్నుమూస్తూ.
" సరళ ఏమో పరధ్యాన్నంగా ఉన్నావు" అని అడిగింది శకుంతల ఆమె వైపే చూస్తూ.
" ఏముంది ఏ బ్రహ్మచారన్న కలలో కొచ్చాడేమో"
" అంతేనంటావా" అంది సెలీనా సరళ వైపు చూస్తూ
" వస్తే మన నాయకుడే వస్తాడు" అంది సుశీల
" ఎవరు మన ..... గారా" అంది శకుంతల నవ్వుతూ
" అవును ఆయనకు తోడులేదు ఈమెకు ... అంది సెలీనా. ముసిముసిగా నవ్వుతూ
" అబ్బా నవ యువకుడు అంటూ" పడి పడి నవ్వింది సరళ.
" యువకుడు కాకుంటే ఏం భారత ప్రధాని" అంది శకుంతల.
ఆడవాళ్లు మాత్రమే గుంపుగా ఉన్నప్పుడు వాళ్ళ సరసాలు, అరమరికలు లేని పదప్రయోగాలు గిలిగింతలు పెట్టే సైగలు బహుశృంగారంగా ఉంటాయి.

శకుంతల సెల్ మోగింది.
" హల్లో " అంది
"చూడు శకుంతల నేను కమీషనర్‌తో మాట్లాడాను, మీరు వెళ్ళి కలవండి" అన్నాడు ముక్తసరిగా మాజీ
" సరే థ్యాంక్స్ సర్" ఆమాటలో వినయం ధ్వనించింది.
" రేపు కౌంటింగ్ దగ్గర ఉండే ఏజెంట్లుగా జర హుషారు వాళ్లను ఉంచండి. ఉంటా మరి" సెల్ ఆఫ్ అయింది. అందరు అక్కడి నుండి కదిలారు. అప్పుడే పనులు దొరికినట్టు, వాటిని పూర్తి చేయించి బిల్స్ తీసుకుంటున్న అనుభూతికి అందరూ లోనై నడుస్తున్నారు. అప్పుడు వాళ్ళ నడకలో వేగం పెరిగింది. ఎగ్జిట్ పోల్ బల బలాల సంఖ్యలను ప్రకటించింది. పార్టీ నాయకుల గుండెల్లో గుబులు మొదలైంది.

పార్టీ నాయకులు తమ తమ పార్టీ బలాలను ప్రకటిస్తునే ఉన్నరు. కౌంటింగ్ ముగిసింది. ఎన్నికైన వాళ్లను పార్టీల వారిగా ప్రకటింగా అంతా! తారుమారు. జోష్యాలు నీళ్లమూటలైనయి. ముహూర్తాలు ఎండమావులైనయి, బంధ్లు ఓడలైనయి. ఎటు చూసిన కలకూరగంప ప్రభుత్వాలు.! పడిపోయిన ప్రభుత్వాలు ప్రశ్చాతాప పడూతు, గుడిని గుజరాత్‌ను గుర్తుచేసుకుంటు ప్రజా తీర్పును గౌరవిస్తాం అంటూ ప్రకటనలు చేస్తున్నయి. మిగతా పార్టీల వాళ్లు తమ తమ తప్పిదాలను నెమరు వేసుకుంటున్నరు.

*

కార్యకర్తల జేబుల్లో సెల్‌లు మోగుతూనేఉన్నాయి. మామూలుగా అన్ని సెల్‌ఫోన్స్ బిల్స్ వచ్చినట్లే కమిటి మెంబర్స్ బిల్స్ వచ్చాయి. సెల్‌పీస్‌ల ధర కిస్తులవారి అందులో కలిసి ఉన్నాయి.
ఒక్కొక్క పీసు పది నుండి పదిహేను వేలు . పదే పదే బిల్స్ కట్టమని వచ్చే మెసేజ్‌లతో తలలు తిరిగిపోతున్న, ఏపనిమీద దృష్టిపెట్టలేక చికాకుపడుతున్నరు. ఎవరికి మరొకరు చెప్పుకోలేని స్థితి. చెప్పుకున్నా ఎట్లా ఎట్లా అనే తప్పా మరో మాటలేదు. ఈ బిల్‌లు ఎవరు కట్టాలన్నదే ప్రశ్న? పరేషాని.
" మనిషి ఓడినా పార్టీ ఉందిగా" అన్న జవాబు.
" పార్టీ దగ్గర పైసలు ఎక్కడివి" అదనపు ప్రశ్న.

" వసూలు చేసిన నిధులూ " ప్రశ్నకు మరో ప్రశ్న.
" మేఘాలలో నీళ్లు ఉంటే కడవలోకి వస్తాయా" ఒకరు.
" పవనాలు పయనిస్తే రాకేం చేస్తాయి." మరొకరు.
" రాకుండా చేసుకున్నది మనమే కదా" ఇంకొకరు.
" ఓటు వేయడం రహస్యం, కాని కౌంటింగ్ ఫలితాలు పారదర్శకం. ఏ వార్డులో ఎన్ని ఓట్లు వచ్చినయి తెలిసిపోయే. మెంబర్లందరి సెల్‌ఫోన్ స్క్రీన్‌మీద టివిలో వచ్చిన రిలయన్స్ వాళ్ల బిల్‌ల వసూల్ విధానం గుర్తొచ్చి చెమటలు పోస్తున్నయి. ఈ కష్టకాలంలో ఏ నాయకుడు ఆదుకుంటడు. ఆనాడు 'మీకు నేను నాకు మీరు అనే. మనం గీత దాటిన అంతె " మనల నమ్మిన వ్యక్తికి మనం నిలబడలేక పోతిమి అయిపోయినంకా అంగలార్చితే ఏమొస్తది, ఓటు వేలంలో వస్తువైపాయె. సెల్ మోగినపుడు పుట్టలో పాము గుర్తొచ్చి కొందరు దానిని ముట్టడంలేదు. మెంబర్స్‌కు రంగనాయకి ఎదురై, వాళ్లను అట్లా చూస్తాఉంటే ఆమెకే నవ్వొచ్చింది, తప్పా ఎవ్వరి ముఖాన నవ్వు కనపడలేదు. తనకిచ్చిన ఫోన్ తన పేరు మీద లేనందుకు సంతోషించింది.
పార్టీ అధ్యక్షుని జేబులో సెల్ మోగింది.
" హల్లో ఎవరు నేను రంగనాయకిని క్,క్,క్,"
" ఏమిటి అంతగా నవ్వుతున్నవు"
" ఏమి లేదండి మన కార్యకర్తలకు ఫోన్ చేస్తే ఎవ్వరు ఎత్తడం లేదు ఎందుకని?"
" ఇంకేమెత్తుతరు అందరు స్విచ్ ఆఫ్ చేసి కూర్చున్నరు. వేలకు వేలు బిల్లులొస్తే ఎవ్వరు కడతరు. ఎక్కడ నుండి తెచ్చి కడతరు" అన్నడు.
" మరి మాట్లాడేటప్పుడు బిల్లు సంగతి తెలియదా? హూ అంటే చేసుడేనాయే, హ అంటే చేసుడేనాయే, వేలకు వేలు బిల్లులు రాకుంటే ఏమొస్తయి" అంది. వేటకారంగ నవ్వుతూ.
" నాయకుల కంటే కొందరు ఓటర్సే హుషార్, లేకుంటే అన్ని పార్టీల దగ్గర డబ్బు తీసుకొని.." అని అన్నడు.
" పదుగురు నిలుచున్నా ఓటు ఒక్కటే గద కాని ఒక్క విషయం నాకు అర్థం కావటంలేదు. మరీ ఈసెల్‌ల బిల్లులు? నవ్వు మాట రెండు కలిసి వచ్చినయి.

మంట పొగ కలిసొచ్చినట్లు.

*

జేబుల్లో సెల్‌లు మోగుతువుంటె ఎత్తక తప్పడం లేదు. ఎత్తితె బిల్ చెల్లించమని మాట మాటికి ఎచ్చరికలు, భరించలేక సెల్‌లను ఇళ్లల్లో పెట్టివస్తున్నా, అవి మోగుతూనే వున్నయి. బిల్ కట్టమని గుర్తు చేస్తునే వున్నాయి. ఇళ్లల్లో చిరాకు భరించరానిగోల ' ఇంట్లో చమురులేదు ఎద్ల కొట్టంలో దివిటా! 'మింగే మెతుకు లేదు మీసాలకు సెంటా?" లాంటి ఇల్లాళ్ళ మాటలు తట్టుకోవడం కష్టమైపోయింది.

కొన్ని రోజులు తరువాత పాత బావుల్లో కొత్త బెక బెక చప్పుళ్ళు. కంప చెట్లల్లో కిచకిచ శబ్దాలు.

ఆతరువాత వాటంతట అవే ఆగిపోయినయి అది వేరే విషయం.

*

కొన్ని రోజుల తరువాత ఫోన్లల్లో ప్రతికల్లో ప్రకటనలు. 'బిల్ అమౌంట్ ఎంతున్నా రెండువేల ఐదొందలు. చెల్లించి ప్రీపెయిడ్ కార్డు తీసుకుంటె పాత బ్యాలన్స్ చెల్లించనవసరం లేదు'. అని.

బావిలో వేసినవి పాడైపోగ, చెట్ల మధ్య పారేసినయి పిల్లలు పీకి ముక్కలు చేసారు.

ఒక్క రంగనాయకి మాత్రం నవ్వుతు బిల్ చెల్లించి, తన పేరు మీద మార్పించుకొని సెల్‌ను సొంతం చేసుకుంది. ఆమె ముఖానా నవ్వు నాట్యమాడుతుంది.

● జూన్ 10-2004